సీమవార్త

రాయల సీమ

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

పేజీలు : 4

బుధవారం 11 నవంబర్ 2026

పంచాయతీ ఎలక్షన్లు పారదర్శకంగా ఉండాలి..!!

....గ్రామ పంచాయతీల నామినేషన్ల ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

.....జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్.



అనంతపురం, నవంబర్ 10 సీమ వార్త. గ్రామ పంచాయతీల 2వ సాధారణ ఎన్నికలు- 2026లో భాగంగా నిర్వహించే నామినేషన్ల ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ సూచించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో గ్రామ పంచాయతీల 2వ సాధారణ ఎన్నికలు- 2026లో భాగంగా స్టేజ్-1 రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, జోనల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో స్టేజ్-1 రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు మరియు జోనల్ ఆఫీసర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ?నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి ఆయా గ్రామ పంచాయతీలలో నోటిఫికేషన్ను ప్రకటించడం,?నామినేషన్లను స్వీకరించడం, ?నామినేషన్లను పరిశీలించి ఫైనల్ చేయడం, ?పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించడం లాంటి విధులను స్టేజ్-1 రిటర్నింగ్ ఆఫీసర్లు నిర్వర్తించాల్సి ఉండగా, వారికి కేటాయించిన విధులను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఇంతకుముందు జరిగిన ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలలో నామినేషన్ల ప్రక్రియలో కొన్ని సంఘటనలు జరిగినందున, స్టేజ్-1 అధికారులు చాలా జాగ్రత్తగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ?నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎవరికైనా ఇబ్బందులు వస్తే వాటిని నిష్పక్షపాతంగా పరిష్కరించాలన్నారు. ?ఎలాంటి ఇబ్బందులకు అస్కారాలు లేకుండా, నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియను సజావుగా కొనసాగించాలన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో కల్యాణదుర్గం, అనంతపురం, గుంతకల్లు డిడిఓలు, స్టేజ్-1 రిటర్నింగ్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, జోనల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.



కియా" సర్కార్ తో... అగ్రిమెంట్ "కియా"..!!



.....పెనుకొండలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు

.....ఫలించిన మంత్రి సవిత కృషి.

.....2 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం.

...ఐటీఐ ఏర్పాటుతో స్థానిక యువతకు ఎంతో మేలు.

.....కియా, అనుబంధ పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.

.....సీఎం చంద్రబాబుకు, మంత్రిమండలికి మంత్రి సవిత ధన్యవాదాలు.





ఇక పల్లె పోరు షురూ

మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు.. షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషన్

రెండో విడతలో ఓబులదేవరచెరువు మండలం.

ఓబులదేవరచెరువు, (నవంబర్11)సీమవార్త:



ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది.దీంతో ఇక గ్రామాల్లో పల్లెపోరు షురూ అవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల సందడి ప్రస్తుతం తగ్గినప్పటికీ గ్రామాల్లో మరోసారి రాజకీయ సందడి నెలకొననుంది.

సర్పంచ్‌లు,వార్డు సభ్యుల ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది.ఇప్పటికే ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల సందడి ముగియగా,తాజాగా గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రకటనతో రాజకీయ పార్టీలు, ఆశావహులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు.శ్రీ సత్యసాయి జిల్లాలోని 32 మండలాల పరిధిలో మొత్తం 467 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.వీటిలో సర్పంచ్‌లు,వార్డు సభ్యుల ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రెండో విడతలో కదిరి, పుట్టపర్తి రెవెన్యూ డివిజన్లలో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా కదిరి రూరల్,నంబుల పూలకుంట,గాండ్లపెంట, తలుపుల,నల్లచెరువు తనకల్లు,ఓడి చెరువు నల్లమాడ,అమడుగురు,కొత్తచెరువు బుక్కపట్నం,పుట్టపర్తి మండలాల్లో రెండో విడతలో ఎన్నికలు జరగనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు.అయితే ఇందులో రెండు డివిజన్లకు గాను మొత్తం 169 గ్రామపంచాయతీలలో ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 16వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ,20,21వ తేదీల్లో స్క్రూట్నీ,23న ఉపసంహరణ తదనంతరం అభ్యర్థుల ప్రచారం,అనంతరం 29న పోలింగ్ అదేరోజు మధ్యాహ్నం 03:00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని అధికారికంగా ఎలక్షన్ల కమిషన్ ప్రకటించింది.

నవంబర్ 19న ఎంపీపీ, 20న జెడ్పీ ఎన్నికలు

....శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి నవంబర్ 10: సీమ వార్త.



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలైన మండల ప్రజా పరిషత్‌లు,జిల్లా పరిషత్‌ల అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు పరోక్ష ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఎన్నికైన ఎంపీటీసీ , జడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులను ఈ నెల 14వ తేదీ నాటికి పంపిణీ చేస్తారు. ఈ నెల 19వ తేదీన మండల పరిషత్‌లలో ఎంపీపీ అధ్యక్ష మరియు ఉపాధ్యక్ష పదవులకు పరోక్ష ఎన్నికలు నిర్వహిస్తారు.ఈ నెల 20వ తేదీన జిల్లా పరిషత్‌లలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు జరుపుతారు. పరోక్ష ఎన్నికల రోజు ఉదయమే మొదటగా మండల పరిషత్తులలో ఒక్కొక్కరు చొప్పున, జిల్లా పరిషత్తులలో ఇద్దరు చొప్పున కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక చేపడతారు.అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు చేతులెత్తే పద్ధతిలో నిర్వహిస్తారు. నామినేషన్ల స్వీకరణ మరియు ఉపసంహరణ ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు కొనసాగుతుంది. ఈ పరోక్ష ఎన్నికలలో ఎక్స్-అఫీషియో సభ్యులైన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఓటు వేసే హక్కు ఉండదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

జడ్పీటీసీ.. ఎంపీపీ లకు ఘన సన్మానం.





పెనుకొండ నవంబర్ 10 సీమవార్త.స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ గా గెలిచిన యశోద కేశవయ్య, ఎంపీటీసీ గా గెలిచిన ఎంపీపీ దండు మమత ఈశ్వరప్రసాద్ ను మంగళవారం పట్టణ బీజేపీ నాయకులు శాలువా కప్పి పూలహారంతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ గ్రామాలలో ప్రజల సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజల మన్ననలు పొందుతూ ఇంకా అత్యున్నత పదవులు పోందాలన్నారు.సన్మానం చేసినవారిలో మమత, హనుమంతుయాదవ్, ముత్యాలమ్మ తదితరులు ఉన్నారు.

వ్యాధుల నివారణకు ముందస్తు ఆరోగ్య పరీక్షలు ఎంతో కీలకం



ప్రొద్దుటూరు, నవంబర్ 10, (సీమ వార్త) : ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా నిత్యజీవితంలో వ్యాయామం, సమతుల్య ఆహారం, క్రమశిక్షణతో కూడిన అలవాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్‌టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు డాక్టర్ టి.డి. వరుణ్ కుమార్ రెడ్డి సూచించారు. ప్రొద్దుటూరు లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన శాఖలో మంగళవారం బ్యాంకు సిబ్బందికి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రతిరోజూ వ్యాయామం, యోగా, ధ్యానం చేయడంతో పాటు పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ముఖ్యంగా 40 ఏళ్లు పైబడిన వారు ఎలాంటి అనారోగ్య లక్షణాలు లేకపోయినా ఏడాదికి ఒకసారి సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధులు ముదిరిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం మేలని పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించిన డాక్టర్ టి.డి. వరుణ్ కుమార్ రెడ్డిని బ్యాంకు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత నైపుణ్య శిక్షణతో ఉద్యోగావకాశాలు



ప్రొద్దుటూరు, నవంబర్ 10, (సీమ వార్త) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. రెండు నుంచి మూడు నెలల పాటు శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్ లేదా డిప్లొమా పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల వయస్సు గలవారు అర్హులని తెలిపారు. రోడ్‌వే సర్వేయర్, జూనియర్ మెకానిక్, బీఐఎం టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారని వెల్లడించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ శాఖలో నమోదై లేబర్ కార్డు కలిగిన వారికి అవకాశం ఉంటుందని పపేర్కొన్నారు ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు, బ్యాంకు పాస్‌బుక్, ఆరు పాస్‌పోర్టు ఫొటోలతో ఎన్ఏసీని సంప్రదించాలని సూచించారు. లేబర్ కార్డు లేనివారు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9985142155 నంబర్‌లో సంప్రదించాలని, సహాయం కోసం ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయాన్ని ఆశ్రయించవచ్చని కమిషనర్ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం



మడకశిర నవంబర్ 10 సీమ వార్త నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం మోపురు గుండు గ్రామంలోత్రాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందువల్ల పరిష్కార దిశంగా

గుడిబండ మండలం మోపురుగుండు గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉండడం వల్ల స్థానిక జడ్పిటి సభ్యులు లక్ష్మీదేవమ్మ సురేష్ , ఎంపీటీసీ జ్యోతి వెంకటరమణ, సమస్యను వాళ్ల దృష్టికి తీసుకొని వెళ్లడం వల్ల మంగళవారం వెంటనే సమస్యకు పరిష్కారముగా స్థానిక ఎంపీటీసీ జ్యోతి వెంకటరమణ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయడం జరిగింది. ఇందుకు సహకరించిన మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి , రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి , జెడ్పిటిసి సురేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ప్రమాణ స్వీకారానికి ముందే గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం పట్ల ప్రజా ప్రతినిధులను గ్రామస్తులు సత్కరిస్తూ మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని తెలియజేస్తున్నారు.

ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపొందిన వారి తుది జాబితా విడుదల.

ఎంపీడీవో వెంకటేశు.



ధర్మవరం నవంబర్ 10 సీమ వార్త: ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల తుది జాబితాను ఎంపీడీవో వెంకటేశు అధికార పూర్వకంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామపంచాయతీలో సి. రత్నమ్మ-టిడిపి, దర్శనమల లో కె. బొజ్జప్ప-వైసిపి, ధర్మపురి లో సి.చంద్ర శేఖర రాజు-వైసిపి, ఏలుకుంట్లలో వి. గణే నాయక్-వైసిపి, గొట్లూరు టి .శ్రీనివాసులు, కును తురులో టి. లక్ష్మీదేవి-వైసిపి, మల్కాపురంలో కె. కాటమయ్య టిడిపి, మల్లా కాలువ లో పి భార్గవి-టిడిపి, పోతుకుంట లో అంగజాల రాజశేఖర్-బిజెపి, పోతుల నాగేపల్లి లో ఎం. ఈశ్వరమ్మ-టిడిపి, రావులచెరువులో జి. ప్రవంతి-వైసిపి, రేగాటిపల్లిలో ఎం. రమణమ్మ-జనసేన, తుమ్మలలో జి. దివాకర్ రెడ్డి-వైసిపి గెలుపొందడం జరిగిందని తెలిపారు.

గెలుపు సంబరాల్లో గొర్రెలు పంపిణీ చేసిన నేమకల్ ఎంపీటీసీ కురుబ గంగమ్మ



బొమ్మనహాల్ నవంబర్ 9: (సీమ వార్త) బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున విజయం సాధించిన కురుబ గంగమ్మ, డోనప్ప తమ విజయాన్ని వినూత్నంగా చాటుకున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన ఆనందాన్ని కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, తమను ఆదరించిన గ్రామ ప్రజలకు గొర్రెలను ఉచితంగా పంపిణీ చేశారు. తమను ఆదరించి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతగా రెండు గొర్రెలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే కాకుండా, గెలిచిన తర్వాత కూడా ప్రజల మధ్య ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో నిలిచే నాయకులుగా సేవలందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమంత రెడ్డి, గాలి బసప్ప, చందప్ప, వసంత్, శాంతయ్య, దొడ్డ హనుమంతప్ప, నారాయణ, గాదిలింగ, రమేష్, గోవిందు తదితర గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న వారిపై పోలీసుల మెరుపు దాడి.. రూ.1.24 లక్షల నగదు స్వాధీనం



కడప, నవంబర్ 10, (సీమ వార్త) : కడప నగరంలో పేకాట కార్యకలాపాలపై పోలీసులు చర్యలు చేపట్టారు. కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత బస్టాండ్ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి, ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి తమ సిబ్బందితో కలిసి సంబంధిత ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 10 మందిని గుర్తించి అరెస్ట్ చేశారు. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో నిందితుల వద్ద నుంచి రూ.1,24,270 నగదు, 10 సెల్‌ఫోన్లు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పేకాట కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు జిల్లా పోలీసు కార్యాలయం వెల్లడించింది. నగరంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి



ప్రొద్దుటూరు, నవంబర్ 10, (సీమ వార్త) : నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను రోడ్లపై, డ్రైనేజీల్లో వేయకుండా మున్సిపాలిటీ సూచించిన ప్రాంతాల్లోనే పారవేయాలని కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోడ్లపై వ్యర్థాలు వేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు డ్రైనేజీలు మూసుకుపోయి మురుగునీరు నిలిచే ప్రమాదం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రొద్దుటూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలి



ప్రొద్దుటూరు, నవంబర్ 10, (సీమ వార్త) : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు అధ్యక్షుడు కొవ్వూరు రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మోడంపల్లె సావిడి వద్ద ప్రజలకు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు ఉపయోగపడేలా సుమారు 500 పర్యావరణహిత సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రమేష్ రెడ్డి అధ్యక్షత వహించడంతో పాటు ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు కొవ్వూరు రవికుమార్ రెడ్డి, కార్యదర్శి గండ్లూరు శ్రీధర్ శర్మ, సంయుక్త కార్యదర్శి కే. సునీల్ కుమార్, రొటేరియన్లు శ్రీరాముల వెంకటేశ్వర్లు, జి.వి. రమణాచారి, స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకుడు రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి ప్రొద్దుటూరు అభివృద్ధి ప్రణాళికలు



ప్రొద్దుటూరు, నవంబర్ 10, (సీమ వార్త) : నియోజకవర్గ అభివృద్ధికి మరింత ప్రాధాన్యతనిస్తూ అవసరమైన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన, ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలను వివరించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి సత్వర పూర్తికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలను కూడా చంద్రబాబుకు వివరించారు. ఈ భేటీలో టీడీపీ యువ నాయకుడు నంద్యాల కొండారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బచ్చుల పుల్లయ్య, శివాలయం చైర్మన్ వంగల నారాయణరెడ్డి, కట్టమీది మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బచ్చుల ప్రతాప్, యోగివేమన ఇంజనీరింగ్ కళాశాల నాన్ టీచింగ్ యూనియన్ అధ్యక్షుడు రసూల్ గౌస్ తదితరులు ఉన్నారు.

టీటీడీ కళ్యాణ మండపం దగ్గర బస్సు స్టాప్ ఏర్పాటు చేయండి.

ఎనిమిదవ వార్డ్ కౌన్సిలర్ పల్లపు పెద్దక్క.




ధర్మవరం నవంబర్ 10 సీమ వార్త : ధర్మవరం పట్టణంలోని శివానగర్లో గల టిటిడి కళ్యాణ మండపం దగ్గర బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలని 8వ వార్డు కౌన్సిలర్ పల్లపు పెద్దక్క ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పెద్దక్క మాట్లాడుతూ, కదిరిగేటు వద్ద ఓవర్ బ్రిడ్జి పనులు సాగుతుండగా ప్రస్తుతం అనంతపురం వెళ్లాలి అంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని, కావున టీటీడీ కళ్యాణ మండపం వద్ద బస్సు స్టాప్ స్టేజ్ ఉండేటట్లు చర్యలు చేపట్టాలని వారు తెలిపారు. ఈ స్టేజ్ వల్ల ఏడవ, ఎనిమిదవ,తొమ్మిదవ, పదవ వార్డు ప్రజలకు ఎంతో ఉపయోగ ఉంటుందని తెలిపారు. మీ సమస్యను పరిష్కరిస్తారని డిపో మేనేజర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పల్లపు రవీంద్ర పల్లపు శివ శంకర్, చింతమేకల శ్రీనివాసులు, జనసేన శ్రీనివాసులు, బాల మాలతి హోటల్ సూరి నారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీ,ఇందిరమ్మ కాలనీలో ఎంపిటిసి కి ఘన సన్మానం



అమరాపురం నవంబర్ 10 సీమ వార్త మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మరియు ఇందిరమ్మ కాలనీలో అమరాపురం ఎంపీటీసీ నాగరాజుకు మంగళవారం రాత్రి ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలమాలతో పాటు శాలువా కప్పి ఎంపీటీసీకి సన్మానం చేశారు. ఎంపీటీసీ నాగరాజు మాట్లాడుతూ తనకు ఓట్లు వేసి గెలిపించిన అమరాపురం పట్టణ మరియు అమరాపురం పంచాయతీ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కారానికి మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల సహకారంతో కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నందు కాలనీ వాసులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్, డైరెక్టర్ దాదా పీర్, రాజప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, రవిచంద్ర,, యోగానంద్, సిద్ధూ తదితర నాయకులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు బ్రౌన్ చేసిన సేవలు అజరామరం



ప్రొద్దుటూరు, నవంబర్ 10, (సీమ వార్త) : తెలుగు భాషా సాహిత్య పరిరక్షణకు సి.పి. బ్రౌన్ చేసిన కృషి చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సి.పి. బ్రౌన్ జయంతి వేడుకల్లో ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలుగు మాతృభాష కాకపోయినా భాషపై అపారమైన అభిమానంతో బ్రౌన్ నిఘంటువు రూపకల్పన, వేమన పద్యాల ప్రచురణ, వ్యాకరణ రచనతో పాటు అనేక ప్రాచీన గ్రంథాలను సేకరించి పరిరక్షించారని తెలిపారు. కడపలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో తెలుగు సాహిత్యంపై ఆసక్తి పెంచుకుని భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ సాధు గోపాలకృష్ణ, న్యాయవాది, కవి సి.వి. సురేష్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మనోహర్ రెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, డాక్టర్ టి.డి. వరుణ్ కుమార్ రెడ్డి, ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, డాక్టర్ పంజగల మధుసూదన్ బాబు తదితరులు పాల్గొని బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

12 గంటలైనా తెరుచుకోని స్వర్ణ వార్డు గ్రామ సచివాలయం

ప్రజలు వస్తున్నారు.. తాళం చూసి వెనుదిరుగుతున్నారు.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?

బొమ్మనహాల్, నవంబర్ 10 (సీమ వార్త): బొమ్మనహాల్ మండల కేంద్రంలోని స్వర్ణ వార్డు గ్రామ సచివాలయం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటలు దాటినా తెరుచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన గ్రామ సచివాలయం తాళం వేసి ఉండటంతో వివిధ పనుల నిమిత్తం అక్కడికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది.గ్రామ సచివాలయానికి ప్రజలు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు, పెన్షన్లు, ఇతర ప్రజా సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే వృద్ధులు, మహిళలు, రైతులు తమ పనులు పూర్తవుతాయని ఆశతో సచివాలయానికి చేరుకుంటున్నారు. అయితే అక్కడ



సిబ్బంది అందుబాటులో లేకపోవడం, కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో గంటల తరబడి వేచి చూసి చివరకు వెనుదిరుగుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రజల ఇంటి వద్దకే పాలన అందించాలనే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రజలకు అవసరమైన సేవలను సకాలంలో అందించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉంది. అలాంటిది మధ్యాహ్నం 12 గంటలు దాటినా కార్యాలయం తెరుచుకోకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా సిబ్బంది సమయపాలన పాటించాలని స్థానికులు కోరుతున్నారు. సచివాలయంలో సిబ్బంది విధులకు హాజరవుతున్నారా? కార్యాలయం ఎందుకు తెరవలేదు? అనే విషయాలపై సంబంధిత అధికారులు పరిశీలన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్వర్ణ వార్డు గ్రామ సచివాలయ పనితీరుపై విచారణ చేపట్టి, ప్రజలకు ప్రతిరోజూ సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన సచివాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని వారు ఆశిస్తున్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం.. ప్రొద్దుటూరులో తనిఖీలు ముమ్మరం



ప్రొద్దుటూరు, నవంబర్ 10, (సీమ వార్త) : పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మరో విడత ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ వెల్లడించారు. ప్రజలు, వ్యాపారుల సహకారంతో ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరు లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. గత ఆగస్టు 1 నుంచి పట్టణంలో ప్లాస్టిక్ నివారణపై వివిధ వర్గాల ప్రజలు, వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని కమిషనర్ తెలిపారు. ఆగస్టు 15న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ సంకల్ప దీక్ష ప్రారంభించి వేలాది మందితో ప్లాస్టిక్ వినియోగించబోమని ప్రతిజ్ఞ చేయించామన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు దుకాణాల్లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నిరుత్సాహపరిచేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రజారోగ్యానికి, పర్యావరణానికి కలిగే నష్టాలను వివరిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించామని, తాను సైకిల్‌పై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. పట్టణ ప్రముఖులతో సలహా సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రతి నెల మూడో శనివారం సమావేశాల ద్వారా ప్లాస్టిక్ నివారణ చర్యలను సమీక్షించామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా గత కొంతకాలంగా ఈ కార్యక్రమాలపై దృష్టి తగ్గిందన్నారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం ఆంక్షలు తొలగిపోవడంతో తిరిగి కార్యాచరణ ప్రారంభించేందుకు సిద్ధమయ్యామని చెప్పారు. ఈ మేరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, ప్రజారోగ్య విభాగం సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈసారి క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ వినియోగించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రజల భాగస్వామ్యంతో ప్రొద్దుటూరును ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుతామని కమిషనర్ స్పష్టం చేశారు.

ఎం ఆర్ పి ఎస్ కమిటీ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ, 10000 ల రూపాయలు ఆర్థికసాయం.



చెన్నేకొత్తపల్లి నవంబర్ 10 (సీమ వార్త): రాప్తాడు నియోజక వర్గంలోని రామగిరి మండలంలోని ఏడు కురాకుల పల్లి గ్రామానికి చెందిన నాగేంద్ర సోమవారం ఆత్మ హత్య చేదికొనియున్నాడు.విషయం తెలుసుకున్న రాప్తాడు నియోజకవర్గంలోని ఎం ఆర్ పి ఎస్ నాయకులు అలాగే రామగిరి త మండలంలోని ఎం ఆర్ పి ఎస్ కమిటీ ల సభ్యులంతా కలిసి మంగళవారం ఎడు కురాకులపల్లి గ్రామములోని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి, ధైర్య పరచి ,మృతుడి కుటుంబానికి రూ, 10000ల రూపాయిల ఆర్థిక సాయాన్ని మృతుడి సోదరుడు మురళీ చేతికి అందించారు. ఈ సందర్భంలో పలువురు మాట్లాడుతూ నాగేంద్ర రామగిరి మండలానికి ఎం ఆర్ పి ఎస్ ఉపాధ్యక్షుడిగా పదవి భాద్యతలు చేపట్టి, మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి అలాగే ఎం ఆర్ పి ఎస్ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని వారు పేర్కొన్నారు.అటువంటి నాయకుడు మృతి చెందడం ఎం ఆర్ పి ఎస్ కు తీరని లోటని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు నియోజక వర్గంలోని ఆయా మండలాల నాయకులు అలాగే రామగిరి మండల నాయకులు పాల్గొన్నారు.

ఎంపీటీసీగా ఓడినా కూడా ప్రజాసేవలో నిమగ్నమైన అభ్యర్థి, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



మడకశిర నవంబర్ 10 సీమ వార్త మండల పరిధిలోని హరిసముద్రం గ్రామంలో తాగునీటి సమస్య విలయతాండం చేయడంతో ఇటీవల టిడిపి తరఫున పోటీ చేసి ఓడిపోయిన అనితమ్మ కర్రీ అన్న మానవతా దృక్పథంతో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. అరే సముద్రం బీసీ కాలనీలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ప్రజలు తెలియజేయడంతో వెంటనే తన వంతుగా అధికారులతో మాట్లాడి ఆ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడానికి అనితమ్మ కరియన్న తీవ్రంగా కృషి చేయడంతో కాలనీవాసులు హర్షవ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి పదవి లేకుండా కూడా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంతో కృషి చేశారని వారి సేవలు మనకు ఎంతో అవసరమని వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో అతను పోటీ చేస్తే తప్పకుండా హరే సముద్రం పంచాయతీ సర్పంచిగా గెలిపించడానికి తమ వంతుగా కృషి చేస్తామని కాలనీవాసులు గ్రామస్తులు తెలియజేస్తున్నారు.

జెడ్పీటీసీ అభినందనలు తెలిపిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు



సోమందేపల్లి నవంబర్ 10 సీమ వార్త ఇటీవల ఎన్నికైన జడ్పిటిసి జయంతి సిద్దలింగప్పలకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పెనుకొండ టిడిపి మండల కన్వీనర్ శ్రీరాములు సన్మానించి అభినందనలు తెలియజేశారు. జయంతి సిద్ద లింగప్ప స్వగ్రామమైన మేకలపల్లిలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నూతన జడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులకు ఘన సన్మానం.

:-యశోద కేశవయ్య, దండు మమతా ఈశ్వర్ ప్రసాద్, జయంతి సిద్ధలింగప్పలకు అభినందనలు.

:- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు





పెనుకొండ నవంబర్ 10సీమవార్త. పెనుకొండ నియోజకవర్గ పరిధిలో ఇటీవల ఎన్నికైన ప్రజాప్రతినిధులను జడ్పీటీసీగా ఎన్నికైన యశోద కేశవయ్య, రూరల్ ఎంపీపీగా ఎన్నికైన దండు మమతా ఈశ్వర్ ప్రసాద్‌లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సోమందేపల్లి మండల జడ్పీటీసీగా ఎన్నికైన జయంతి సిద్ధలింగప్పను స్వగ్రామమైన మేకలపల్లిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిర్ణయమే తుది నిర్ణయం

ఎన్నికల ప్రక్రియలో నిబంధనలే ప్రామాణికం -- ఏ.ఆర్.ఓ. బాలకృష్ణుడు.



చెన్నేకొత్తపల్లి నవంబర్ 10 (సీమ వార్త): ఇటీవల జరిగిన స్థానిక సంస్థలలో ఎన్నికలలో భాగంగా ఎంపీటీసీ అలాగే జడ్ పి టీ సి ఎన్నికలలో ఓబులంపల్లి ఎంపీటీసీ వైసిపి అభ్యర్థిని డోలా ఆధిలక్ష్మమ్మ ఓటర్లు లెక్కింపు రోజు తనకు 750 ఓట్లు వచ్చాయని టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థికి 745 ఓట్లు మాత్రమే వచ్చాయని, నేను టీడీపీ అభ్యర్థి పై గెలచినప్పటికి గెలచినట్లుఎన్నికలు దృవీకరణ పత్రం తనకు ఆర్ ఓ ఇవ్వకుండా వేరేవారికి ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసినదే. ఈ విషయమై చెన్నేకొత్తపల్లి మండల ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎం బాలకృష్ణుడిని లేపాక్షి టైమ్స్ దినపత్రిక విలేకరి వివరణ అడుగగా ఏ ఆర్ ఓ ఎం బాలకృష్ణుడు తెలుపుతూ మండల పరిధిలో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి, జిల్లా ఎన్నికల అధికారులు సూచనమేరకు,ఎన్నికల నియమావళి ల ప్రకారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని ఎన్నికల ప్రక్రియలో ఇది కీలకమని ఏ.ఆర్.ఓ. బాలకృష్ణుడు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించామని తెలిపారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల ఏజెంట్లు ఎన్నికల నియమావళికి లోబడి వ్యవహరించారన్నారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, విజేతలకు డిక్లరేషన్ ఫారాల జారీ వంటి అంశాల్లో ఎన్నికల నిబంధనల ప్రకారమే అధికారులు చర్యలు తీసుకున్నారని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబంధిత జిల్లా పంచాయతీ, జిల్లా కలెక్టర్, అధికారులు,అలాగే ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా చట్టబద్ధమైన విధానాలను అనుసరించామని ఏ.ఆర్.ఓ. బాలకృష్ణుడు పేర్కొన్నారు.

ఎన్.పి.కుంట సర్పంచ్ అభ్యర్థిగా దేరంగుల రెడ్డప్ప బరిలోకి.....



నంబులపూలకుంట: నవంబర్ 10(సీమవార్త): ఎన్.పి. కుంట గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా దేరంగుల రెడ్డప్ప ఎన్నికల బరిలో నిలిచారు. గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే సంకల్పంతో తాను సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా దేరంగుల రెడ్డప్ప మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు తనపై నమ్మకం, విశ్వాసం ఉంచి ఆశీర్వదించి గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామంలో చాలా కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామ ప్రజలకు ఎంతో అవసరమైన కూరగాయల సంత, పశువుల సంత ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని వెల్లడించారు. అదేవిధంగా గ్రామంలోని అన్ని వీధుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేసి, రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని తెలిపారు.గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతూ, ఎన్.పి. కుంట గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని దేరంగుల రెడ్డప్ప స్పష్టం చేశారు. ప్రజలు తనకు ఒక అవకాశం కల్పిస్తే గ్రామ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేసి వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మడకశిరలో అంతులేని ఫైనాన్స్ ఆగడాలు



మడకశిర నవంబర్ 10 సీమ వార్త పట్టణంలో రోజురోజుకు ఫైనాన్షియర్ ఆగడాలు ఎక్కువవుతున్నాయని బాధితులు తారోపిస్తున్నారు. బరితెగించిన ఫైనాన్షియర్, కుటుంబ సభ్యుల ముందే వళ్ళు హూనమయ్యే విధంగా చితకబాదిన వైనం పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలకు వెళితే పట్టణంలో ఫైనాన్స్ మణికంఠ రెడ్డి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. దినసరి వడ్డీ, వారం వడ్డీ , అధిక వడ్డీలతో ప్రజల రక్తాన్ని జలగల పిడిస్తున్న మణికంఠ రెడ్డి ఆగడాలు పట్టణములు ప్రజలు తట్టుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పట్టణంలోని మల్లికార్జున అనే వ్యక్తి దగ్గర ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుని మరి కొంత అధికంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని బెదిరిస్తూ బహిరంగంగా దాడికి తెగబడ్డాడు. మణికంఠ రెడ్డి ఆగడాలకు అధికారులు వత్తాసు పలుకుతారా లేక బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేస్తారా అన్నది వేచి చూడాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజల్లో చర్చనీయాంశమైంది. గత వారం రోజుల క్రితం పట్టణంలోని మధుగిరి సర్కిల్లో ఓ వ్యక్తిపై అతి పైశాచికంగా దాడికి తెగబడ్డాడు అంతేకాక మల్లికార్జున పై కూడా దాడి చేసి గాయపరిచారు మల్లికార్జున కు తలకు ఐదు కుట్లు పడ్డాయి. మడకశిర వ్యాప్తంగా మణికంఠ రెడ్డి వేధింపులకు గురైన బాధితులు త్వరలోనే పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కు నున్నారని తాజా సమాచారం. మణికంఠ రెడ్డి ఆగడాలకు అడ్డు అదుపు లేక పోతోంది అధికారులు స్పందించి అతనిపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని బాధితులు పట్టణ ప్రజలు వాపోతున్నారు.

స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వైసి గోవర్ధన్ రెడ్డి కి ఘనంగా సన్మానం



మదకశిర నవంబర్ 10 సీమ వార్త మండల పరిధిలోని చందకచర్ల పంచాయతీ ఎంపిటిసి గా గెలుపొందిన వెంకటేష్ తనకు బీఫారం ఇప్పించి తన గెలుపుకు కృషి చేసినందుకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి, జిల్లా యువజన భాగం ఉపాధ్యక్షులు తిమ్మారెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షులు దివాకర్, చందకచర్ల పంచాయతీ అధ్యక్షులు హరి, ఎక్స్ ఎంపిటిసి గోపాల్ నాయక్,సీనియర్ నాయకులు నారాయణస్వామి మల్లేశప్ప, రామంజప్ప, మహర్షి రవి, నాగరాజ్, మంజు, కొత్తలం నాగరాజు, విజయ్ కుమార్, శశి, కమ్మరి మూర్తి, బుజ్జి, రాజప్ప, బాలు, గాజుల హరి, ఉమేష్, కాలే నాయక్ ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

ధర్మవరం నూతన మున్సిపల్ చైర్మన్ పరిసే సుధాకర్ కు సన్మానం.



ధర్మవరం నవంబర్ 10 సీమ వార్త ; ధర్మవరం మున్సిపాలిటీ నూతన చైర్మన్ గా ఎన్నికైన టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిచే సుధాకర్ ను ధర్మవరం తెలుగు దేశం పార్టీ నాయకులు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ని వందలాది మంది టీడీపీ నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ధర్మవరం పట్టణంలో దీపావళి పండుగను మరిపించేలా బాణాసంచా పేలుళ్ళతో సంబరాలు అంబరాన్ని అంటాయి . టపాసులతో, వాయిద్యాలతో కేరింతలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ గా ఎన్నికైన పరిసే సుధాకర్ మాట్లాడుతూ, ఈ విజయం కష్టపడి పనిచేసిన నాయకులందరిదీ అని ఈ విజయం తో సంతృప్తి పడకుండా ధర్మవరం అభివృద్ధి, ప్రజల ప్రశాంత జీవితం లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమతం కాటమయ్య, శ్రీశైలం పురుషోత్తం గౌడ్, చింత పులుసు పెద్దన్న, ఫణి కుమార్,కొత్తపేట ఆది, హస్సేన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష



ప్రొద్దుటూరు, నవంబర్ 10, (సీమ వార్త) : మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ఆమె ఆత్మహత్యకు కారణమైన కేసులో నిందితుడికి కడప పోక్సో ప్రత్యేక న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.15 వేల జరిమానా విధించింది. ఈ మేరకు ప్రత్యేక న్యాయమూర్తి ఎం.ఎ. సోమశేఖర్ నవంబర్ 10న తీర్పు వెల్లడించారు. చింతకొమ్మ దిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలో 2018లో ఈ ఘటన చోటుచేసుకుంది. కేసు వివరాల ప్రకారం.. బాధిత బాలిక, నిందితుడు బవిగడ్డ విష్ణు గోపాల్ సహవిద్యార్థులు. బాలికపై లైంగిక దాడికి పాల్పడటంతో ఆమె గర్భం దాల్చింది. తనను వివాహం చేసుకోవాలని కోరగా నిందితుడు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక 2018 సెప్టెంబర్ 2న కడప, కృష్ణాపురం రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. తొలుత కడప రైల్వే పోలీసులు కేసు నమోదు చేయగా, తదుపరి దర్యాప్తులో వెల్లడైన అంశాల ఆధారంగా చింతకొమ్మదిన్నె పోలీసులకు కేసు బదిలీ అయింది. నిందితుడిపై అత్యాచారం, ఆత్మహత్యకు ప్రేరేపించడం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో చట్టాల కింద కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సేకరించిన ఆధారాలు, న్యాయస్థానంలో సమర్పించిన సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిని దోషిగా నిర్ధారించి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.15 వేల జరిమానా విధించారు. కేసు విచారణలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొమ్మినేని వేణుగోపాల్ వాదనలు వినిపించగా, కోర్టు మానిటరింగ్ ఏఎస్ఐ ఎ. నాగేంద్ర, హెడ్ కానిస్టేబుల్ మిద్దె పుల్లయ్య సహకరించారు. పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రత్యేకంగా అభినందించారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు.



పావగడ: నవంబర్ 10 సీమ వార్త సాయంత్రం. గుండార్లహళ్లి సమీపంలో సోమవారం సాయంత్రం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో మహిళతో సహా ముగ్గురికి గాయాలయ్యాయి.గుడిబండ పక్కన చితుర్పి గ్రామం నుంచి సీకేపుర మార్గంలో పావగడకు వస్తున్న సవేరా(30) నడుపుతున్న బైకును ఎదురుగా అతివేగంగా వచ్చిన బైకు గుండార్లహళ్లి పోలేరమ్మ ఆలయం సమీపంలోని మలుపు వద్ద ఢీకొంది.ఈ ప్రమాదంలో సవేరాకు కుడిచేతికి, తలకు, ఆమె వెంట ఉన్న 7 ఏళ్ల మహమ్మద్ వారిస్‌కు కుడికాలికి, తలకు గాయాలయ్యాయి. వెంట ఉన్న నయీమా బానుకు స్వల్ప గాయాలయ్యాయి. మరో బైకు రైడర్‌కు కూడా గాయమైంది.క్షతగాత్రులను పావగడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సవేరాను తుమకూరు జిల్లా ఆసుపత్రికి, మహమ్మద్ వారిస్‌ను బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు పావగడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

పురం కమిషనర్ కు....దేశభక్తి వాదుల సలాం.

....జాతీయ జెండా లోగో వద్ద పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత.





హిందూపురం: నవంబర్ 10 సీమ వార్త. హిందూపురం పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో ఏర్పాటు చేసిన జాతీయ జెండా లోగో పరిసరాల్లో మున్సిపల్ సిబ్బంది పరిశుభ్రత చర్యలు చేపట్టారు.కోట్నూరు కట్ట వద్ద ఏర్పడిన జాతీయ జెండా లోగో వద్ద అధికగా పెరిగిన పొదలు, పిచ్చి మొక్కలతో కప్పబడి ఉండటాన్ని గమనించి మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున వెంటనే స్పందించి మున్సిపల్ సిబ్బంది తో వాటిని తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక జాతీయ జెండా పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు జెండాకు తగిన గౌరవం కల్పించడం మన బాధ్యత అన్నారు. పట్టణ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది అందరూ ఇక్కడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అప్పుల భారంతో చేనేత కార్మికుడు ఆత్మహత్య.

మృతుడు చింతా బాలు



ధర్మవరం నవంబర్ 10 సీమ వార్త ; ధర్మవరం పట్టణంలోని సంజయ్ నగర్ లో గల చేనేత కార్మికుడు చింతా బాలు (44) కుటుంబ పోషణ నిమిత్తం చేసిన అప్పులు తీర్చలేక, కుటుంబ భారం మోయలేక గుర్తు తెలియని మాత్రలు అధికంగా తీసుకొని మృతి చెందాడు. ఈ సందర్భంగా వన్ టౌన్ పోలీసులు మాట్లాడుతూ, మృతుడు సొంతమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించేవాడని తెలిపారు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నిచోట్ల దాదాపు నాలుగు లక్షల దాకా అప్పులు చేశాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలని మదనపడేవాడని తెలిపారు. అంతేకాకుండా భర్త చేసిన అప్పును ఎలా తీర్చాలో తెలియక 25 రోజుల కిందట భార్య కూడా తాడిపత్రిలో మాత్రలు మింగి మృతి చెందడం జరిగిందని తెలిపారు. భార్య మృతి చెందడంతో మృతుడు చింతా బాలు ప్రతిరోజు మనోవేదనకు గురి అయ్యేవాడు అని, ఒకవైపు అప్పులు, మరోవైపు భార్య మృతి, కుటుంబ పోషణ, ఇద్దరు కొడుకుల చదువులు ఎలా అన్న తపనతో మధన పడేవాడని తెలిపారు. మంగళవారం ఉదయం ఇంటిలో ఎవరూ లేరు సమయంలో గుర్తుతెలియని మాత్రలు అధిక సంఖ్యలో మింగి ఆత్మహత్యకు పాల్పడడం జరిగిందని తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి ధర్మవరం పట్టణంలోని గండికోట ఆసుపత్రిలో వైద్య చికిత్సలు అందించి, అనంతపురం సవేరా హాస్పిటల్ చేర్చారు. అక్కడ కూడా వైద్య చికిత్సలు అందిస్తూ మృతి చెందడం జరిగిందన్నారు. మృతునికి ఇద్దరు కుమారులు వారిలో జ్ఞానేష్ ,లోకేష్ ఉన్నారని తెలిపారు. జ్ఞానేష్ ఇడుపులపాయలో త్రిబుల్ ఐటీ చదువుతున్నాడని, లోకేష్ తాడిపత్రిలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడని తెలిపారు. మృతుని తండ్రి చింతా ఓబులేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని వన్టౌన్ పోలీసులు తెలిపారు.

తెలంగాణ గడ్డ లోని... రామనేశ్వర గుడిలో రాయల మురళి.



అనంతపురం నవంబర్ 10 సీమ వార్త. తెలంగాణ రాష్ట్రంలో భువనగిరి నియోజకవర్గం నాగిరెడ్డి పల్లెలో రామనేశ్వరం ఆలయాన్ని సందర్శించిన శ్రీశ్రీ అఘోర అవధూత రామానంద స్వామి సేవ ఆశ్రమ ట్రస్ట్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల్ మురళి 300 ఎకరాల్లో 2000 అద్భుత శివలింగాలు దేవతామూర్తులను దర్శించి అభిషేకం చేసి శ్రీ చక్ర మహాలయం 1100 ప్రతిష్టించి ఈ దేవాలయంలో 400 ఆవులను గోశాలలో ఏర్పాటుచేసి ప్రతిరోజు శివలింగాలకు అభిషేకం రుద్రాభిషేకం ప్రతి సోమవారం ప్రతి ఏకాదశి ప్రతి ఆరుద్ర నక్షత్రం ప్రతి మాస శివరాత్రి రోజులలో రుద్రాభిషేకం జరుగుతాయి మూడు అడుగుల స్ఫటిక శివలింగం 34 భంగిమలతో గల సాయిబాబా విగ్రహ మూర్తులను ఏర్పాటు చేశారు ఈ దేవాలయంలో అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్ని దానాలలో అన్నదానం శ్రేష్టమైనది నిత్య అన్నదాన సేవలో జరుగుతున్నాయి ఈ ఆలయంలో మహా కాలభైరవుడు శివలింగేశ్వరుడు మూడు అడుగుల బంగారు శివలింగం ప్రతిరోజు అభిషేకాలు జరుగుతాయి ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించడం నా పూర్వజన్మ లో చేసుకున్న పుణ్యంలా భావిస్తున్నాను ఈ ఆలయాన్ని సందర్శించడానికి మా ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీ అఘోర భార్గవరామ్ కేదార్నాథ్ స్వామీజీ గారి పిలుపుమేరకు శ్రీ రమణానంద మహర్షి గారు 11 సంవత్సరాల లోనే 300 ఎకరాలని డెవలప్ చేసి ఇంత పెద్ద దేవాలయాన్ని నిర్మించిన రమణ మహర్షి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశాను

ఎన్నికల విధుల పేరుతో ఉపాధ్యాయులను మానసికక్షోభకు గురి చేయవద్దు.....

ఆరోగ్య సమస్యలున్న వారికి విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి.....ఫ్యాప్టో



నంబులపూలకుంట: నవంబర్ 10 (సీమవార్త):స్థానిక ఎన్నికల విధుల నిర్వహణ పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఒత్తిడికి,ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ హరి ప్రసాద్ రెడ్డి, గౌస్ లాజాం తెలిపారు. ఈరోజు ఎన్నికల విధుల కేటాయింపులో, నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఫ్యాప్టో పక్షాన జిల్లా డిఆర్ఓ కొండాయ్య కు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెలలో జరిగిన మున్సిపల్,ఎంపీటీసీ /జడ్పీటీసీ ఎన్నికల విధులు నిర్వహణకు ఉద్యోగులు తాము పని చేస్తూన్న ప్రాంతానికి 100,200 కిలోమీటర్ల దూరంలో విసిరేసినట్లు ఎన్నికల విధులు కేటాయించడం వలన ప్రయాణ భారం, పని ఒత్తిడి పెరుగి తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని తెలిపారు. తీవ్ర ఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, చంటి పిల్లల తల్లులు, గర్భిణులు, పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులను, వికలాంగులు, బదిరులకు సైతం ఎలాంటి మినహాయింపులు లేకుండా ఎన్నికల విధులు కేటాయించారని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గించి వారి భద్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెలలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేసే మండలానికి, స్థానిక మండలానికి సమీపంలోని పక్క మండలంలో లేదా అదే నియోజకవర్గ పరిధిలో విధులు కేటాయించాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఇచ్చిన నిబంధనల మేరకు తీవ్ర ఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, చంటి పిల్లల తల్లులు, గర్భిణులు, 60 సంవత్సరాలు పైబడి పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులను, వికలాంగులు, బదిరులకు ఎన్నికల విధులు నుండి మినహాయించాలని తెలిపారు. ఎన్నికల రోజు ఎన్నికల సిబ్బందికి భోజన , వసతి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. గత ఎన్నికలలో ఎన్నికలు ముగిసిన అనంతరం రవాణా సౌకర్యం లేక ఉపాధ్యాయుల తీవ్ర అవస్థలు పడ్డారని వాటిని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ ఎన్నికలు ముగిసిన అనంతరం ఎన్నికల విధులు కేటాయించిన ఉపాధ్యాయులు స్వస్థలాలకు చేరుకునేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన మరుసటి రోజు తీవ్ర అలసటతో ఉన్న సిబ్బందికి ఓడీ సౌకర్యం కల్పిం చాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ నాయక్, చంద్రశేఖర్, గోపాల్ నాయక్, సురేంద్ర, మనోజ్, లక్ష్మీనారాయణ, వెంకమ నాయుడు, జనార్ధన్, గోపాల్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుని మృతి పట్ల సంతాపం



మడకశిర నవంబర్ పది సీమ వార్త మండల పరిధిలోని హరిసముద్రం పంచాయతీ ఒంటిపాళ్యం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు లక్ష్మీనారాయణ మంగళవారం అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇటీవల ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయిన అనితమ్మకరియైన వెంటనే ఆ గ్రామాన్ని సందర్శించి మృతదేహంపై పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు కరియన్న మాట్లాడుతూ లక్ష్మీనారాయణ పార్టీకి ఎంతో సేవలు చేశారని ఆయన మృతి పార్టీకి తీయని లోటని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు నారాయణప్ప, టిడిపి నాయకుడు నాగేంద్ర, గోవిందప్ప టిడిపి నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జడ్పీటీసి సిరియాల ప్రసాద్ కు ఎమ్మెల్యే, మాజీమంత్రి ఘన సన్మానం



ఓబుళదేవరచెరువు (నవంబర్11)సీమవార్త: ఓడి చెరువు మండలం జెడ్పీటీసీగా గెలుపొందిన సిరియాల ప్రసాద్ ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు తమ క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి,పూలమాలలు వేసి సన్మానం చేసి అభినందించారు. అనంతరం మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ... రాజకీయాల్లో మొట్టమొదటిసారి ప్రవేశించి ఓడిసి జెడ్పిటిసి అభ్యర్థిగా పోటీచేసిన సిరియాల ప్రసాద్ ఎన్నికల ప్రచారంలో యువత తోడ్పాటుతో ఎంతో చాకచక్యంగా పనిచేశారని ప్రశంసించారు.ప్రసాద్ కు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న పార్టీ సీనియర్లను సమన్వయంతో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తారని మాజీమంత్రి పల్లె ఆకాంక్షించారు.త్వరలో జరగనున్న సర్పంచ్ ఎన్నికలను మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకొని తెలుగుదేశం పార్టీ మద్దతు అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి సూచించారు.జడ్పిటిసి ప్రసాద్ వెంట పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు,యువకులు ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు:

సీఐ ఆర్. శ్రీనివాసులు. హెచ్చరిక



యాడికి నవంబర్ 10 (సీమ వార్త) యాడికి మండలం: రాబోయే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో యాడికి మండలంలో సీఐ ఆర్. శ్రీనివాసులు. ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఉదయం ఆరు గంటలకే మండలంలోని బస్టాండ్, కుంట ప్రాంతం, అంగళ్ల వద్ద రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతూ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా అల్లర్లు, అవాంఛనీయ కార్యక్రమాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని తెలిపారు. సీఐ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ తనిఖీలు నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాల

అక్షరమే ఆయుధం.. విద్యే జీవితానికి వెలుగుబాట

-అజ్ఞానమనే చీకటిని పారద్రోలే జ్ఞానజ్యోతి విద్య

-సమాజ మార్పునకు పునాది

- సమానత్వ సాధనకు మార్గం

- నేడు జాతీయ విద్యా దినోత్సవం

మిట్ట మహేష్ సీనియర్ జర్నలిస్ట్ పులివెందుల



పులివెందుల నవంబర్ 10 (సీమ వార్త):విద్య మనిషికి కేవలం అక్షరజ్ఞానాన్ని మాత్రమే అందించదు. ఆలోచించే శక్తిని, మంచిచెడులను విశ్లేషించే వివేకాన్ని, జీవితంలో ఉన్నతంగా ఎదిగే ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుంది. పేదరికం, అసమానతలు, మూఢనమ్మకాలనే సంకెళ్లను తెంచే శక్తి విద్యకే ఉంది. అందుకే విద్యను ప్రతి ఒక్కరి హక్కుగా గుర్తించి, భావితరాలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

మౌలానా సేవలకు గుర్తుగా:

భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఈ రోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. 1888 నవంబర్ 11న జన్మించిన ఆయన దేశ విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, మహిళలు, పేదలు, వెనుకబడిన వర్గాలకు సమాన విద్యావకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2008 నుంచి నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నేటికీ కొన్ని ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులు, సామాజిక పరిస్థితుల కారణంగా పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. బాల కార్మికత్వం, మధ్యలోనే చదువు మానేయడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ప్రతి పేద బిడ్డకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వాలు, సమాజం బాధ్యతగా గుర్తించాలి. పాఠశాలలు కేవలం చదువు నేర్పే కేంద్రాలుగా కాకుండా, సంస్కారం, క్రమశిక్షణ, మానవత్వం నేర్పే విజ్ఞాన నిలయాలుగా ఎదగాలి. విద్యావంతుడైన వ్యక్తి తన జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని సైతం మార్చగలడు. అందుకే ప్రతి ఇంటా అక్షరజ్యోతి వెలగాలి.. ప్రతి బిడ్డ చేతిలో పుస్తకం ఉండాలి.. ప్రతి విద్యార్థి కలలకు రెక్కలు రావాలి. అదే జాతీయ విద్యా దినోత్సవం మనకు అందించే సందేశం. విద్యావంతుడైన వ్యక్తి తన జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని సైతం మార్చగలడు. అందుకే ప్రతి ఇంటా అక్షరజ్యోతి వెలగాలి.. ప్రతి బిడ్డ చేతిలో పుస్తకం ఉండాలి.. ప్రతి విద్యార్థి కలలకు రెక్కలు రావాలి అన్న నినాదాలతో ముందుకు వెళ్దాం.

గ్రామాల అభివృద్ధికి చదువే ఆయుధం..

జేసీ ప్రభాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు!

చదువుకున్న యువతకే సర్పంచ్ టికెట్..

చర్చనీయాంశంగా జేసీ కండిషన్స్!



తాడిపత్రి నవంబర్ 10 (సీమ వార్త): రానున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలపై మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. సర్పంచ్ ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అందులోనూ చదువుకున్న యువతకే అవకాశం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం జేసీ ప్రభాకర్ రెడ్డి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసే వారికి చదువు విషయంలో కండిషన్లు పెట్టారు. తాను ప్రతిపాదించే ప్రతి అభ్యర్థికి ఈ నియమాలు తప్పనిసరిగా వర్తిస్తాయని తేల్చి చెప్పారు. “పోటీ చేసే ప్రతి అభ్యర్థి చదువుకున్న వ్యక్తి అయి ఉండాలి. ఎస్సీ అభ్యర్థి అయితే 10వ తరగతి, బీసీ అభ్యర్థి అయితే ఇంటర్, ఓసీ అభ్యర్థి అయితే డిగ్రీ చదివి ఉండాలి. ఇది నా కండిషన్” అని జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు.ెచదువుకున్న వారికే అవకాశం ఇస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. చదువుకున్న సర్పంచ్ ఉంటే ప్రభుత్వ పథకాలు, నిధులు, అభివృద్ధి పనుల గురించి సరిగ్గా తెలుస్తుందని, గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి సరిగ్గా తీసుకెళ్లగలరని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కూడా ప్రజలు డబ్బు, కులం చూడకుండా మంచి అభ్యర్థిని ఎన్నుకోవాలని సూచించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలన్నదే తన ప్రధాన లక్ష్యమని, అందుకే యువతకు, చదువుకున్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నానని పేర్కొన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి పెట్టిన ఈ కండిషన్స్‌పై గ్రామాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఇది మంచి నిర్ణయమని సమర్థిస్తుండగా, మరికొందరు చదువు లేకపోయినా అనుభవం ఉన్న నాయకులు గ్రామాలకు అవసరమని అంటున్నారు. ఏదేమైనా జేసీ వ్యాఖ్యలు ఇప్పుడు తాడిపత్రి రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

ఓటుకు నోటు కాదు... అభివృద్ధికి ఓటు వేయండి..

మర్రికొమ్మదిన్నే పంచాయతీ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా ధ్యేయం.....

సర్పంచ్ అభ్యర్థి సిద్ధ రమాదేవి.



నంబులపూలకుంట: నవంబర్ 10(సీమవార్త, మర్రికొమ్మదిన్నే గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి సిద్ధ రమాదేవి ప్రజల ముందుకు వచ్చారు. పదవిని అధికారంగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తూ, మర్రికొమ్మదిన్నే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల్లో డబ్బు, ప్రలోభాలకు లొంగకుండా గ్రామ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటుకు నోటు తీసుకునే రాజకీయాలకు స్వస్తి పలికి, గ్రామాభివృద్ధికి కృషి చేసే నిజాయితీపరులైన అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రజల నమ్మకమే తనకు కొండంత బలమని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తానని తెలిపారు. ప్రతి రూపాయికి లెక్క.. ప్రతి పనిలో పారదర్శకత గ్రామపంచాయతీకి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేస్తానని రమాదేవి స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల నిర్వహణలో అవినీతికి తావులేకుండా, ప్రతి పనిలో పారదర్శకత పాటిస్తూ ప్రజలకు జవాబు దారీగా ఉంటానని తెలిపారు. గ్రామానికి వచ్చే నిధులు ఎక్కడ, ఏ పనికి ఖర్చు చేస్తున్నారో ప్రజలకు తెలిసేలా పాలన కొనసాగిస్తానని పేర్కొన్నారు.మౌలిక వసతుల కల్పనే తొలి ప్రాధాన్యం మర్రికొమ్మదిన్నే గ్రామంలోని సమస్యలను గుర్తించి ప్రజల అభిప్రాయాలు, అవసరాలకు అనుగుణంగా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మెరుగైన వ్యవస్థ ఏర్పాటు, ప్రతి వీధిలో ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య సేవలు

గర్భవతులకు అన్ని రకముల రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు



యాడికి నవంబర్ 10 సీమ వార్త జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కటారి వెంకటరమణ ఆదేశాల మేరకు ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యాడికి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్ డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మాతృ మాత వందన యోజన అభియాన్ ఐ రిస్క్ గర్భవతులకు అన్ని రకముల రక్తపరీక్షలు నిర్వహించి మరియు గర్భవతులను పరీక్షించడం జరిగింది కాన్పులకు ఒక వారం ముందుగా ప్రభుత్వ ఆసుపత్రులకు 108 ద్వారా వెళ్లి అడ్మిట్ కావాలని తెలియజేయడం జరిగింది ఐ రిస్క్ అనగా నెగిటివ్ బ్లడ్ గ్రూప్స్ థైరాయిడ్ ఎత్తు తక్కువ మేనిరికము పెళ్లయిన పది సంవత్సరాలు గర్భం దాల్చుట మూడు కన్నా ఎక్కువ అబార్షన్స్ అయినా ఈ గర్భవతులను ఐరిస్కు గర్భవతులు అంటారు ఐరిస్క్ కు గర్భవతులు గర్భం దాల్చిన మూడో నెల నుంచి ప్రతి నెల 9వ తేదీ లేదా పదో తేదీ యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వచ్చి చెకప్ చేయించుకొని వెళ్లవాలని తెలియజేయడం జరిగింది జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోజ్ ఆదేశాల మేరకు తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఇక్కడికి వచ్చిన ఐదు గర్భవతులకు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాలు పరిశుభ్రత గురించి వివరించి ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే పాటించాలని తెలియజేయడం జరిగినది ఈ పద్ధతులు పాటించే వల్ల డెంగ్యూ మలేరియా చికెన్ గునియా ఫైలేరియా మొదలగు జరాలు రాకుండా నివారించవచ్చునని తెలియజేయడం జరిగింది అనంతరం రాయల్ చెరువు రమణారెడ్డి ప్రతినెల ఏర్పాటు చేస్తున్నటువంటి ఉచిత భోజనం గర్భిణీ స్త్రీలకు పెట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు మేల్ అండ్ ఫిమేల్ సూపర్వైజర్లు రాంప్రసాద్ గౌడ్ మేరీ విజయ కుమారి ఏఎన్ఎంలు ల్యాబ్ టెక్నీషియన్ శిరీష ఎమ్ ఎల్ హెచ్ పీ లు ఆశా కార్యకర్తలు మొదలగు వారు పాల్గొన్నారు

ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులకు మరో అవకాశం

కడప, నవంబర్ 10, (సీమ వార్త) : ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు గల్లంతైన అర్హులైన పౌరులకు మరో అవకాశం కల్పించినట్లు ఓటర్ల నమోదు అధికారి వెంకటపతి విజయనగరం తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గైర్హాజరు, నివాస మార్పు, మరణం, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదు కావడం వంటి కారణాలతో జాబితాలో చోటు దక్కని వారి వివరాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, పురపాలక కార్యాలయాలు, జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. జాబితాలో పేరు లేని ఓటర్లకు బూత్ స్థాయి అధికారులు నేరుగా నమోదు పత్రాలు అందజేస్తారు. అందుబాటులో ఉన్న ఫోన్ నంబర్లకు వాట్సాప్, సందేశాల ద్వారా కూడా పంపిస్తారు. పాత ఓటరు గుర్తింపు కార్డు సంఖ్యతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా ఈసీఐనెట్ యాప్ ద్వారా పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. గతంలో నివాసం మారని వారు అనుబంధం-బి ప్రకటనతో పాటు, గతంలో వివరాలు సమర్పించలేకపోవడానికి గల కారణాలను తెలియజేయాలి. రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్న వారు కొత్త చిరునామాతో అనుబంధం-ఏ ప్రకటన సమర్పించాలని, ప్రత్యేకంగా ఫారం-8 అవసరం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే కొత్త ఓటరు నమోదు కోసం ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. చిరునామా ఆధారాలు లేని నిరాశ్రయులకు బూత్ స్థాయి అధికారి క్షేత్రస్థాయి పరిశీలన నివేదిక ఆధారంగా నివాస ధ్రువీకరణ కల్పిస్తామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, ఒకరి పేరు రెండుసార్లు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియను నవంబర్ 20లోగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఓటుకు నోటు కాదు... అభివృద్ధికి ఓటు వేయండి...

ఎన్. పి. కుంట పంచాయతీ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం....

సర్పంచ్ అభ్యర్థి దేరంగుల రెడ్డప్ప..



నంబులపూలకుంట: నవంబర్ 10(సీమవార్త, ఎన్.పి. కుంట గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి దేరంగుల రెడ్డప్ప ప్రజల ముందుకు వచ్చారు. పదవిని అధికారంగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తూ, పెడబల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల్లో డబ్బు, ప్రలోభాలకు లొంగకుండా గ్రామ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ.. ఓటుకు నోటు తీసుకునే రాజకీయాలకు స్వస్తి పలికి, గ్రామాభివృద్ధికి కృషి చేసే నిజాయితీపరులైన అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రజల నమ్మకమే తనకు కొండంత బలమని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తానని తెలిపారు. ప్రతి రూపాయికి లెక్క.. ప్రతి పనిలో పారదర్శకత గ్రామపంచాయతీకి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేస్తానని ఉమాదేవి స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల నిర్వహణలో అవినీతికి తావులేకుండా, ప్రతి పనిలో పారదర్శకత పాటిస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉంటానని తెలిపారు. గ్రామానికి వచ్చే నిధులు ఎక్కడ, ఏ పనికి ఖర్చు చేస్తున్నారో ప్రజలకు తెలిసేలా పాలన కొనసాగిస్తానని పేర్కొన్నారు.మౌలిక వసతుల కల్పనే తొలి ప్రాధాన్యం ఎన్. పి. కుంట గ్రామంలోని సమస్యలను గుర్తించి ప్రజల అభిప్రాయాలు, అవసరాలకు అనుగుణంగా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ప్రతి వీధిలో ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వర్ధంతి సందర్భంగా అగాపే ఆశ్రమంలో అన్నదానం



యాడికి నవంబర్ 10 సీమ వార్త యాడికి మండలకేంద్రం కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో కుంచపు వీరేష్ ,వీరమ్మ మనవడు రిత్విక్ మొదటి వర్ధంతిని జ్ఞాపకం చేసుకుంటూ అన్నదానం ఏర్పాటు చేశారు. కుంచపు రామస్వామి, భార్య చాముండేశ్వరి, వారి కూతుర్లు యశస్విని, సైనిక, వారి కుమారుడు రిత్విక్ జ్ఞాపకార్థ నిమిత్తమై, తమ కుమారుని పేరు మీద అగాపే ఆశ్రమంలో వృద్ధులకు, నిరాశ్రయులకు భోజనాలు ఏర్పాటు చేయించి, అన్నదానం చేశారు. ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్,ఆశ్రమంలోని వారంతా కుమారుని లేని లోటు దేవుడు తీర్చాలని కోరుకుంటూ కుటుంబమంతటికి అభినందనలు తెలిపారు.

ప్రజా సేవల్లో వేగం పెంచాలి..

సచివాలయ సిబ్బందికి కౌన్సిలర్ మల్లికార్జున సూచన!

సంక్షేమ పథకాల అమలుపై చర్చ!




తాడిపత్రి నవంబర్ 10 కౌన్సిలర్‌గా గెలుపొందిన తర్వాత తొలిసారిగా 44వ వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సిబ్బందితో వివరంగా చర్చించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. సచివాలయానికి వచ్చే ప్రతి పౌరుడికి మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మల్లికార్జున మాట్లాడుతూ, “ప్రజల సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బందితో కలిసి పనిచేస్తాను. వార్డు అభివృద్ధే నా లక్ష్యం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 44వ వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళి సందర్భంగా విశేష పూజలు



అమరాపురం నవంబర్ 10 సీమ వార్త మండల పరిధిలోని చిట్టనదుకు గ్రామ సమీపంలో ఉన్న శ్రీ బనశంకరి భారత్ పెట్రోలియం పిల్లింగ్ స్టేషన్ నందు మంగళవారం దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వాహకులు త్రివేణి,కుమార్ ల ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు మిషన్లతోపాటు పెట్రోల్ పంపు లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం వినియోగదారులకు స్వీట్లు పంపిణీ చేశారు.

జడ్పీటిసి గుండుమల చంద్రప్పను సన్మానించిన....కదిరేపల్లి టిడిపి నాయకులు



మడకశిర నవంబర్ 10 సీమ వార్త మండల పరిధిలోని కదిరేపల్లి పంచాయితీ పరిధిలోని టిడిపి నాయకులు మంగళవారం నూతన జడ్పీటిసి గుండుమల చంద్రప్పను ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన గుండుమల మాజీ సర్పంచ్ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సోదరుడు గుండుమల చంద్రప్ప అధిక మెజార్టీతో జడ్పీటిసిగా గెలపొందడంతో కదిరేపల్లి టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కదిరేపల్లి ఎంపీటీసీ బలరామప్ప, కదిరేపల్లి పంచాయితీ టిడిపి అధ్యక్షుడు గుర్రపు కొండ పాండురంగప్ప, బిసి సెల్ అధ్యక్షుడు కంబాలపల్లి శ్రీనివాస్, గుర్రపు కొండ శ్రీరామప్ప, రవి, నాగ, గోవిందరాజ్ టిడిపి నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరిషత్ పోటీ విజేత అలివేలమ్మ కు ఘన సన్మానం.

.... గెలుపొందిన ఎంపీటీసీ అలివేలమ్మ దంపతులను సన్మానించిన... దేవరకొండ ఫ్యామిలీ.





గోరంట్ల నవంబర్ 10 సీమ వార్త గోరంట్ల పట్టణం లోని ఎంపీటీసీ 3 సభ్యులు జాల అలివేలమ్మ జాల ఈశ్వరయ్య మెజారిటీ తో గెలిచినా సందర్భంగా వారి స్వగృహానికి వెళ్లి సెలవ పూలహారలతో సత్కరించి శు భాకాంక్షలు తెలపడం అయినది ఈ కార్యక్రమంలో మాజీ .ఎంపీటీసీ మునిస్వామి దేవరకొండ ఉమా శంకర్ కలీముల్లా ,ఆది ,దాదు రామాంజనేయులు రాజీవ్ కాలనీ మల్లికార్జున , సద్దాం మునిస్వామి ,టెంపో రమణ ,రమణప్ప ,రవి ,శంకర కాలనీవాసులు అదేవిధంగా ఎరుకల సంఘం నాయకులు నరసింహప్ప ,కుళ్లాయప్ప ,బాలకృష్ణ ,రమణప్ప ,కూటమి నాయకులు, పాల్గొన్నారు

గెలుపుకు కృతజ్ఞత గా....కన్వీనర్ బాలకృష్ణ చౌదరికి సన్మానం.



గోరంట్ల నవంబర్ 10 సీమ వార్త గోరంట్ల పట్టణంలోని ఎంపీటీసీ 5.సభ్యులు సాహిదా జిలన్ మెజారిటీ తో గెలిచినా సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి గుత్తాబాలకృష్ణచౌదరి మండల కన్వీనర్ ని కలిసి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ సభ్యులు జిలన్, గోరంట్ల టౌన్ 6మ్యాన్ కమిటీ సభ్యులు,నాగేనాయక్,,షేక్ అజముతుల్లా, పాల సముద్రం సింగల్ విండో అధ్యక్షులు, బెల్లలచెరువు చంద్ర, సింగల్ విండో డైరెక్టర్ నబిరసూల్,మల్లపల్లి మహమ్మద్,మాజీ సర్పంచ్ ఉత్తమరెడ్డి,అమానుల్లా, బూత్ కన్వీనర్ దదు , రఫిక్, నూరమహమ్మద్,ఫయ్యి,లక్ష్మిపతి,రోహిత్, సుభాహన్,మైనారిటీ నాయకులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు....

పరిషత్ విధుల్లో ... ఉపాధ్యాయులకు పరేషాన్.

....జరగబోవు పంచాయతీ ఎన్నికలలో వాటిని నివారించాలి.

..... ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ యూనియన్1938... పుట్టపర్తిలో కలెక్టర్ కు వినతి.

.... పాల్గొన్న యూనియన్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర.



పుట్టపర్తి నవంబర్ 10 సీమ వార్త రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న స్థానిక సార్వత్రిక మండల మరియు జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణ విధి నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఏపీటీఎఫ్ ఒ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో ఎన్నికల సిబ్బందిని జిల్లాలో సుదూర ప్రాంతాలకు నియమించడం. సరైన సౌకర్యాలు కల్పించకపోవడం. చంటి బిడ్డ తల్లులను, వ్యాధిగ్రస్తులను, వయసు మళ్ళిన వారిని నియమించడం. తిరుగు ప్రయాణంలో ఒంటరి మహిళా ఉపాధ్యాయురాలు అని కూడా చూడకుండా అర్ధరాత్రి 1:30 సమయంలో ఒడిసి బైపాస్ రోడ్డులో వదిలిపెట్టిన ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్య వైఖరి ని ఖండిస్తూ. రాబోయే పంచాయతీ ఎన్నికలలో ఇలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా నివారించాలని కలెక్టర్ కు ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు కాలువ సురేంద్ర విన్నవించారు. ఎంపీటీసీ /జడ్పీటీసీ ఎన్నికలలో సుదూర ప్రాంతాలకు డ్యూటీలు వేయడం వలన ప్రయాణ బడలిక ఎక్కువై విధుల నిర్వహణలో ఇబ్బంది ఎదుర్కోవడం జరిగినది. కావున పంచాయతీ ఎన్నికలలో పక్క మండలానికి ఎన్నికల విధులను కేటాయించాలని .ఎన్నికల సిబ్బందికి ప్రయాణ ఏర్పాట్లలో అవకతవకలు జరగడం వలన ఆలస్యంగా స్టేషన్కు చేరుకునే పరిస్థితిని నివారించాలని. రిసీవింగ్ మరియు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ మెటీరియల్ ఇవ్వడానికి, తీసుకోవడానికి తగిన ఏర్పాట్లు లేనందున పోలింగ్ సిబ్బంది నిరీక్షించవలసిన పరిస్థితి ఏర్పడినది. అంతేకాకుండా భోజన వసతి కల్పించని పరిస్థితులు కనపడ్డాయి. పంచాయతీ ఎన్నికలలో తగు ఏర్పాట్లు చేయాలని.చిన్నపిల్లల తల్లులకు, గర్భిణీ స్త్రీలకు, దీర్ఘకాలిక వ్యాధులకు గురి అయిన వారికి, 58 సంవత్సరములు పైబడిన వారికి ఎన్నికల విధుల నుండి మినహాయించాలని . ఎన్నికల మరుసటి రోజు ఎన్నికల విధులలో పాల్గొన్న వారికి ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని .ఎన్నికల విధులలో పాల్గొన్న వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఇప్పటివరకు జరిగిన ఎన్నికలలో కొన్నిచోట్ల కల్పించలేదు. పంచాయతీ ఎన్నికలలో పునరావృతం కాకుండా చూడగలరని కోరుచున్నాము.పోలింగ్ సిబ్బంది పోలింగ్ ఫినిషింగ్లో రాత్రి బస చేసే క్రమంలో తగిన వసతులు లేక ఇబ్బందులకు గురైనారు. ఎన్నికల విధులు నిర్వహించడానికి ఇబ్బంది పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. పంచాయతీ ఎన్నికలలో తగు ఏర్పాటు చేయించగలరని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పక్షాన జిల్లా అధ్యక్షుడు కాలువ సురేంద్రజిల్లా ఉపాధ్యక్షుడు పి.గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

....పురం లో...నవీన్ నిశ్చల్ కలిసిన గోరంట్ల జన సైనికులు.

.... నవీన్ నిచ్చల్ ను గజమాలతో సన్మానించిన... జడ్పీటీసీ సునేత్ర అనిల్ యాదవ్.



గోరంట్ల నవంబర్ 10 సీమ వార్త. ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండల జడ్పీటీసీగా జనసేన పార్టీ అభ్యర్థి శ్రీమతి సునేత్ర అనిల్ యాదవ్ అత్యధిక మెజారిటీతో ఘనవిజయం సాధించిన సందర్భంగా, నేడు జనసేన పార్టీ హిందూపురం సమన్వయకర్త శ్రీ నవీన్ నిశ్చల్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా గోరంట్ల జడ్పీటీసీ ఎన్నికల్లో విజయానికి అందించిన సహకారం, మార్గనిర్దేశం, ప్రోత్సాహానికి శ్రీ నవీన్ నిశ్చల్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ విజయం జనసేన నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషికి, గోరంట్ల మండల ప్రజల ఆశీర్వాదానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సునేత్ర అనిల్ యాదవ్, మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, ఉమ్మడి అనంతపురం జిల్లా సంయుక్త కార్యదర్శి సి. వెంకటేష్, వీరమహిళ కావేరి, వానవోలు సింగిల్ విండో డైరెక్టర్ నాగేష్, మండల నాయకులు శ్రీనివాసులు, గాజుల రమేష్, వెంకటరమణ, సింగిరెడ్డిపల్లి రమేష్, శ్రీరాములు, దేవులచెరువు రమేష్, నాగేంద్ర, రామాంజి, గోవర్ధన్.నాని తదితరులు పాల్గొన్నారు.

కియా" సర్కార్ తో...అగ్రిమెంట్ "కియా"..!!



పెనుకొండ నవంబర్ 10 సీమ వార్త. జిల్లా యువతకు మేలు కలిగేలా మంత్రి సవితమ్మ చేసిన కృషి ఫలించింది. పెనుకొండలో ఐటీఐ కళాశాల ఏర్పాటుకు రెండు ఎకరాలు కేటాయిస్తూ సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని మంత్రిమండలి సమావేశం నిర్ణయం తీసుకుంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం, రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా పెనుకొండ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 1245-1లో ఉన్న రెండు ఎకరాల భూమిని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు కేటాయించనున్నారు. ఐటీఐ కళాశాల ఏర్పాటుతో పదో తరగతి పూర్తి చేసుకున్న యువతకు వృత్తి, సాంకేతిక పరమైన విద్య అందించే అవకాశం కలుగుతుంది. దీనివల్ల కియా, దాని అనుబంధ పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ కళాశాల ఏర్పాటుతో పెనుకొండ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల విద్యార్థులకు సాంకేతిక విద్య, వృత్తి విద్య లో శిక్షణ పొందే అవకాశం లభించనుంది. మంత్రి బాధ్యతలు చేపట్టిన రెండున్నరేళ్లలో పెనుకొండ
స్థానికంగానే ఉద్యోగావకాశాలు
ఐటీఐ ఏర్పాటుతో వృత్తి, సాంకేతిక విద్య అభ్యసించే విద్యార్థులకు స్థానింగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలో కియా, దాని అనుబంధ పరిశ్రమలు విస్తృతంగా ఏర్పాటువుతున్నాయన్నారు. ఆయా పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన ఉద్యోగుల అవసరం ఉందన్నారు. ఐటీఐ శిక్షణ పొందిన విద్యార్థులకు ఆ పరిశ్రమల్లో సులభంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు ద్వారా వేలాది మంది విద్యార్థులకు ఎంతో మేలు కలుగునుందన్నారు. 2029 నాటికి 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఎన్నికల హామీకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. పెనుకొండలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు, ఇతర సహచర మంత్రివర్గ సభ్యులకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

హైదరాబాద్‌లో టపాసుల వివాదం..

కత్తులతో దాడి.. ముగ్గురిపై హత్యాయత్నం

రోడ్డుపై వెళ్తున్న చిన్నారిపై టపాసు విసరడంతో వివాదం..

ప్రశ్నించిన మేనమామతో వాగ్వాదం.. ముగ్గురిపై కత్తులతో దాడి

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని పటేల్‌నగర్, గాంధీభవన్ ప్రాంతంలో టపాసులు పేల్చే విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. చిన్నారిపై టపాసు విసరడాన్ని ప్రశ్నించినందుకు ముగ్గురు వ్యక్తులపై కత్తులతో దాడి జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ దాడిలో షేక్ వహీద్, షేక్ ఇమ్రాన్, షేక్ షాబాజ్ గాయపడ్డారు. చిన్నారిపై టపాసు విసరడంతో మొదలైన గొడవ : అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. పటేల్‌నగర్, గాంధీభవన్ ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న ఓ చిన్నారిపై కొందరు వ్యక్తులు టపాసు విసిరినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గమనించిన చిన్నారి మేనమామ వారిని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో వివాదం తీవ్రరూపం దాల్చింది. సల్మాన్, అర్బాజ్‌తో పాటు మరికొందరు కత్తులతో దాడి : చిన్నారిపై టపాసు విసిరిన విషయాన్ని ప్రశ్నించడంతో మొదలైన గొడవలో సల్మాన్, అర్బాజ్‌తో పాటు మరికొందరు వ్యక్తులు ముగ్గురిపై కత్తులతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో షేక్ వహీద్, షేక్ ఇమ్రాన్, షేక్ షాబాజ్ తీవ్రంగా గాయపడ్డారు. దాడి అనంతరం స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు. బేగంబజార్ పోలీసుల దర్యాప్తు : ఘటనపై సమాచారం అందుకున్న బేగంబజార్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘర్షణకు అసలు కారణాలు ఏమిటి? దాడిలో ఎవరెవరు పాల్గొన్నారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది. చిన్నారుల భద్రతను విస్మరించొద్దు.. వివాదాలతో ప్రాణాలు తీసుకోవద్దు! పండుగల సమయంలో టపాసులు కాల్చేటప్పుడు చిన్నారుల భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా టపాసులు విసరడం ప్రమాదకరం. ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా ప్రశ్నించాలి తప్ప, కత్తులతో దాడులకు దిగడం ఏమాత్రం సమర్థనీయం కాదు. చిన్నపాటి వివాదాలు ప్రాణాపాయ పరిస్థితులకు దారితీయడం సమాజానికి ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి.

అధికారుల నిర్లక్ష్యం..

వృథాగా పోతున్న భగీరథ నీళ్లు

మాగనూరు ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భవిష్యత్తు అవసరాల కోసం ఆదా చేయాలని ప్రభుత్వం ఒకవైపు ప్రచారం చేస్తుంటే.. మరోవైపు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచేలా మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. మాగనూరు మండల కేంద్రంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలి మూడు రోజులైనా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో విలువైన తాగునీరు వృథాగా పారుతూ చెరువును తలపిస్తోంది. పైప్‌లైన్ నుంచి బయటకు వస్తున్న నీరు పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున నిలిచిపోవడంతో నీటి వనరులు వృథా కావడమే కాకుండా పరిసర ప్రాంతాలు చిత్తడిగా మారుతున్నాయి. ఒకవైపు మాగనూరు కృష్ణ మండల పరిధిలోని ఎనిమిది గ్రామాల ప్రజలు మిషన్ భగీరథ ద్వారా సక్రమంగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా నీరు వృథాగా పారుతున్నా అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాల నే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణంగా పథకం లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాగనూరు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందు జాతీయ రహదారి పక్కన ప్రజలకు తాగునీరు అందించాల్సిన పైప్‌లైన్ల నుంచే నీరు వృథాగా ప్రవహిస్తుంది. నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పే ప్రభుత్వ యంత్రాంగం ముందుగా తన శాఖల పరిధిలో జరుగుతున్న నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ అనంతరం

చాలా మంది చేయాల్సిన పనులు ఇవే..

ఉద్యోగ విరమణ అంటే పని జీవితానికి ముగింపు. కానీ చురుకైన జీవనానికి మాత్రం ముగింపు కాకూడదు. వయసు పెరిగే కొద్దీ శారీరకంగా ఆరోగ్యంగా ఉండడంతోపాటు మానసికంగా చురుకుగా, సామాజికంగా అందరితో కలిసిమెలిసి ఉండటం కూడా ఎంతో ముఖ్యం. కార్యాలయం నుంచి బయటకు వచ్చినంత మాత్రాన ఉత్పాదకతకు దూరం కావాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. ఆర్థికంగా పదవీ విరమణకు సిద్ధమవ్వడంతోపాటు, ఆ తర్వాతి జీవితాన్ని ఆరోగ్యంగా, ఉత్సాహంగా గడిపేందుకు కూడా ముందుగానే ప్రణాళిక వేసుకోవాలని సూచిస్తున్నారు. ఆధునిక వైద్యం, టీకాలు, యాంటీబయాటిక్స్ వల్ల మనుషుల ఆయుర్దాయం పెరిగింది. అయితే ఎక్కువకాలం జీవించడం మాత్రమే ముఖ్యం కాదు. ఆ కాలమంతా ఆరోగ్యంగా ఉండడం కూడా అవసరం. మనం ఎంతకాలం బతుకుతున్నామన్నదానితోపాటు, ఎంతకాలం ఆరోగ్యంగా జీవిస్తున్నామన్నది ముఖ్యమని వారు అభిప్రాయపడుతున్నారు.ఒక్కసారిగా మారిపోయే దినచర్య..: ఉద్యోగ విరమణ తర్వాత చాలామందికి రోజువారీ దినచర్య ఒక్కసారిగా మారిపోతుంది. కార్యాలయ వాతావరణం,